598) ధన్నాసి

ప॥ నీవు మన్నించగా నే నింతయితి గాక। కావరించి నీతో నవ్వగలనా నేను॥

చ॥ ఘనుడ విడె మియ్యగా కాదన రాదు గాని। చెనకి నీ సొమ్ములంట చెల్లునా నాకు।
చనవిచ్చి మాటాడగా జాలు ననరాదు గాని। తనర నీతో నేక తాలదాననా॥

చ॥ వరుస నీవు రాగా వద్దనగా రాదు గాని। తర మెరిగి రప్పించ దగునా నాకు।
వొరసి చేయి వేయగా నోప ననరాదు గాని। సరి నింత దీమసపు సతినా నేను॥

చ॥ నీవు కౌగిట గూడగా నేమనరాదుగాని। యీవేళ మందెమేళా వెమ్మెలా నాకు।
శ్రీవేంకటేశ నీవు సేసినట్టే సేతుగాని। చేవదేర మెచ్చి సంతసించిచ కుండగలనా॥